


# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 98 | పేజీలు : 8 | వెల : రూ.2/- మంగళవారం 05 మే 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## తమిళనాడు కొత్త చరిత్ర
# ఆవిష్కృతం

● ద్రవిడ పార్టీల పాలనకు చరమగీతం ● అనూహ్యంగా దూసుకు వచ్చిన విజయ్ పార్టీ ● మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా టివికె ● ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందు చేసిన ఫలితాలు ● తమిళనాడు సిఎం స్టాలిన్ ఘోర పరాజయం ● ఆయన బాటలోనే అత్యధిక మంత్రులు ఓటమి

● పెద్దగా ప్రభావం చూపని బిజెపి నేతలు

**చెన్నై,మనజన ప్రగతి మే 04:** తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతమయ్యింది. అనూహ్యంగా దూసుకు వచ్చిన నటుడు విజయ్ పార్టీ తమిళనాట జెండా పాతింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ ద్రవిడ పార్టీలను మట్టి కరిపించింది. అధికార డిఎంకెను ఓ కుమ్ము కుమ్మింది. తమిళనాట హిందీ వ్యతిరేకత, దక్షిణాదికి అన్యాయం అంటూ హుంకరించిన సిఎం స్టాలిన్ పార్టీ ఓడడమే గాకుండా స్వయంగా ఆయన కూడా ఓడిపోయారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళ్‌సై సైతం వరుసగా రెండోసారి ఓటమిదిశలో ఉన్నారు. ఒకప్పటి తన అనుచరుడు, డిఎంకె పార్టీ నేత చేతిలో దారుణంగా ఓటమి చెందారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం విజయం దిశగా మిగతా2లో...



## ఐదు రాష్ట్రాల్లో
# చారిత్రక ఎన్నికలు

● భారత రాజ్యాంగాన్ని బలపరచిన ఎన్నికలు ● భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన ఎన్నికలు ● బెంగాల్ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి ● గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం ● అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం ● తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా ● బిజెపి కార్యాలయంలో జరిగిన విజయోత్సవంలో మోడీ

**న్యూఢిల్లీ,మనజన ప్రగతి మే 04:** ఇవాళ భాజపా చరిత్ర సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని అన్నారు. ఇది ప్రజలకు నిజమైన భరోసా ఇచ్చిన రోజు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు. అని ప్రధాని అన్నారు. నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ దిల్లీలోని భాజపా కార్యాలయానికి సంప్రదాయ పంచెకట్టుతో వచ్చారు. పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. మిగతా2లో...

## మోడీ నాయకత్వానికి
# ప్రజల మద్దతు

- ఎన్నికల ఫలతాలపై చంద్రబాబు నాయుడు



**అమరావతి,మన జన ప్రగతి మే 04:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అబి .ప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి మిగతా2లో...



## ఆ మూడు రాష్ట్రాలు మార్పు కోరుకున్నాయి

- ఎన్‌డిఎ విజయంపై పవన్ అభినందనలు

**అమరావతి,మన జన ప్రగతి మే 04:** తమిళనాడు, కేరళం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆ మార్పును తమ తీర్పు ద్వారా స్పష్టంగా తెలియజేశారని పేర్కొన్నారు. అస్సాం, మిగతా2లో...

## మోడీ నాయకత్వంపై
# ప్రజల విశ్వాసం

- ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



2లో



## మధ్యాహ్న భోజనంలో రాగిజావ కొనసాగింపు

పాఠశాలల్లో మరోమూడేళ్ల కొనసాగేలా ఒప్పందం

మంత్రి లోకేశ్ సమక్షంలో విద్యాశాఖ ఒప్పందం

**అమరావతి,మన జన ప్రగతి మే 04:**ఏపీ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026-29 కాలానికి ఈ కార్యక్రమం కొనసాగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని తరగతుల విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులు చేసి ఎక్కువ మంది విద్యార్థులకు రుచికరమైన, శుచిగా భోజనం అందించేందుకు మంత్రి నారా లోకేశ్ మిగతా2లో...

## నెల్లూరు జిల్లాలో
# మహానాడు

- మహానాడు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- జిల్లా పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు,మనజన ప్రగతి మే 04:** తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహానాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు మిగతా2లో...

## తిరుపతి జిల్లాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

● ఆగివున్న లారీని ఢీకొన్న అంబులెన్స్ ● రోగి సహా నలుగురు దుర్మరణం




**శ్రీకాళహస్తి,మన జన ప్రగతి మే 04:** తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కతా నుంచి ఓ రోగిని చికిత్స నిమిత్తం బెంగళూరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. ఓరందూరు వద్ద హైవే పక్కన నిలిపి ఉన్న లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో సహా ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద మిగతా2లో...

## బెంగాల్ గెలుపుతో
# విపక్షాల్లో వణుకు

● తెలంగాణలోనూ బిజెపి గెలుపు తథ్యం ● అత్యంత ప్రతిష్టాత్మకంగా 10న ప్రధాని సభ:ఎంపి ధర్మపురి అర్వింద్ వెల్లడి



**హనుమకొండ,మన జన ప్రగతి మే 04:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హనుమకొండలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనుందన్నారు. మిగతా2లో...

# తమిళనాడు కొత్త చరిత్ర ఆవిష్కృతం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. మంత్రులు చాలామంది ఇంటి ముఖం పట్టారు. ఇక టీవీకే చీఫ్ విజయ్.. పెరంబూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తాజా సమాచారం ప్రకారం టివికె 108 స్థానాల్లో, 59 స్థానాల్లో డిఎంకె, 44 స్థానాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు లీడింగ్‌లో ఉన్నారు. చెన్నై, చంగల్‌పట్టు, కంచీపురం, తిరువల్లూరులో టివికె విజయ కేతనం ఎగురవేసింది.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో ద్రావిడ్ పార్టీల ఆధిపత్యం ఉండేది. సెంట్రల్ తమిళనాడులోనూ టీవీకే మంచి పోటీ ఇచ్చింది. తిరుచిరాపల్లి, తాంజావురు, కరూర్, పెరంబలూరు, అరియాలూరు, నాగపట్టణం, తిరువరూరు, పుదుకొట్టై, మలదుతరై జిల్లాలో టివికె గట్టి పోటీనిచ్చింది. దీంతో దళపతి ఇక కొత్త సిఎంగా కావడం అనివార్యం అయ్యింది. చిన్నా చితక పార్టీలు లేదా అన్నడిఎంకెతో పొత్తు కుదిరితే సరిపోతుంది. మొత్తంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో దళపతి విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం ద్వారా ఎన్నికల బరిలోకి దిగిన ఆయన, దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలను విస్మయానికి గురిచేశారు. తాజా ట్రెండ్స్ ప్రకారం, విజయ్ నేతృత్వంలోని టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ముందంజలో ఉండి, రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా దూసుకుపోతోంది. సినిమా స్టార్‌లు రాజకీయాల్లో రాణించలేరన్న అపవాదును చెరిపివేస్తూ, విజయ్ తన సినీ పాపులారిటీని ఓట్లుగా




మార్చుకోవడంలో సఫలమయ్యారు. తద్వారా దివంగత నేతలు ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల సరసన ఆయన నిలిచారు. 1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, ఏఐఏడీఎంకే కాకుండా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయడం ఇదే తొలిసారి.పార్టీ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ.. 'ఇది కుటుంబ రాజకీయాలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఎవరి మద్దతు లేకుండానే మేము సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ నివాసం వద్ద ఆయన కుటుంబ సభ్యులు పార్టీ గుర్తు అయిన 'విజిల్' సాంగ్‌తో సంబరాలు చేసుకున్నారు. మెజారిటీ మార్కు 118కి టీవీకే చేరువలో ఉంది. చిన్న పార్టీల మద్దతుతో లేదా స్వతంత్రంగా విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ, జెండాలు ఊపుతూ పండుగ చేసుకున్నారు. ఇకపోతే ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఓడిపోయారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన..టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 9వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. కొళత్తూరు నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేక పోయారు. 1996 తర్వాత స్టాలిన్ ఓడిపోవడం ఇదే తొలిసారి. ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీవీకే గెలుపు దిశగా దూసుకుపోతోందిఅయితే టీవీకే మెజారిటీకి అతి దగ్గరలో ఆగిపోయిన పక్షంలో ఆ పార్టీ మద్దతు తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. కాగా, సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలెయెన్స్‌లో భాగంగా డీఎంకేతో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ 5 స్థానాల్లో, సీపీఐ రెండు స్థానాల్లో, సీపీఎం ఒక స్థానంలో గెలుపునకు చేరువలో ఉన్నాయి. డీఎంకేతో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆ పార్టీలోని కొందరు టీవీకే పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్‌లోని ఒక వర్గం మొదట్నించీ పట్టుపడుతోంది. అయితే చివరి నిమిషంలో డీఎంకేతోనే కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తీసుకునే అవకాశాలు బలంగా ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా టీవీకే ఇటు కాంగ్రెస్‌తో పాటు ఐయూఎంఎల్, డీఎండీకే, లెఫ్ట్ పార్టీల సాయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. డాక్టర్ అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పీఎంకే మద్దతును కూడా టీవీకే కూడగట్టవచ్చని చెబుతున్నారు. ఏదిఏమైనా పూర్తి ఫలితాలు వెలువడిన తర్వాతే టీఎంకే వ్యూహరచన ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. పార్టీ కార్యకర్తల సంబరాల్లో నేనూ పాల్గొంటున్నా. బెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగింది. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయి. గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకూ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి. బ్రహ్మపుత్ర ఆశీర్వాదం వల్ల అస్సాంలోనూ హ్యాట్రిక్ సాధించాం. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను మేం నెరవేర్చాం. బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుంది. ఇక నుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని ప్రకటించారు. సుపరిపాలన అందించిన ందుకే ప్రజలు మాకు పట్టం కట్టారు. తమ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే భాజపా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా అంటేనే అభివృద్ధి.. సంక్షేమం అని మోదీ పేర్కొన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించి ందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవ రూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. బెంగాల్‌లో మార్పుకోరుతూ పవనాలు బలంగా వీచాయని పేర్కొన్నారు. బీజేపీ అంటేనే సుపరిపాలన అనే విషయం ప్రజలకు బాగా తెలుసునని ప్రశంసించారు. స్సాంలో బీజేపీ-ఎన్డీయేను ప్రజలు మరోసారి ఆశీర్వదించారని, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని ప్రధాని కొనియాడారు. తిరుగులేని తీర్పునిచ్చిన అస్సాం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వోతో ముఖాభివృద్ధికి భరోసాగా ఉంటామన్నారు. దశాబ్దాలుగా పార్టీ, కూటమి ఎదుగుదలకు అవిశ్రాంతంగా కృషి చేసిన బీజేపీ-ఎన్డీయే కార్యకర్తలను అభినందించారు. ముఖ్యమంత్రి ఎన్.రామస్వామి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం టాక్ రికార్డు, సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టిన పుదుచ్చేరి ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలకు అభినందనలు చెప్పారు. ఎన్డీయేకు మద్దతుగా ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలు, వారి జీవనప్రమాణాల మెరుగుదలకు తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. తమిళనాడు ప్రగతి, ప్రజాక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జెపి నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం




(మొదటి పేజీ తరువాయి)

ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయంకలగకుండాప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు.

# దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

- స్థానిక వ్యతిరేకతతోనే కేరళలో కాంగ్రెస్ విజయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య



**కరీంనగర్,మనజన ప్రగతి మే 04:** దేశమంతా ఇక డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని.. బంగ్లా చొరబాటు దారులకు దారులు మూసుకుపోయాయని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశం అంతా బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని అన్నారు. సీఎం ఎక్కడికి వెళ్తే.. అక్కడ కాంగ్రెస్‌కు ఓటమినేనని ఎద్దేవా చేశారు. కేరళంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటంతోనే.. ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు కొంత అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీనేనని బండి సంజయ్ సెటైర్లు గుప్పించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని బండి సంజయ్ అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ఈ ఘటనను రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. దుకాణం యాజమాన్యంతో మాట్లాడానని, బాధితులకు అండగా నిలవాలని కోరానని అన్నారు.

# మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

దిశగా కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ దిశగా కేందం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతివర్గానికీ అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శని కతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో దూ సుకెళ్తున్నఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఉద్ఘాటించారు.

# ఆ మూడు రాష్ట్రాలు మార్పు కోరుకున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకున్న ఎన్డీఏకు ఈ సందర్భంగా పవన్ శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రజల నమ్మకాన్ని పొందేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొన్ని సంవత్సరాలుగా కృషి చేశారని, ఇప్పుడు దానికి ఫలితం దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వం లో పశ్చిమ బెంగాల్ ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సురక్షితంగా ఉంటామన్న విశ్వాసంతోనే ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని పవన్ అన్నారు. ఈ భారీ విజయానికి భాగస్వాములైన మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ నేత సువేందు అధికారికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. అస్సాం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి మరోమారు విజయాన్ని సాధించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు, పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమికి విజయాన్ని మళ్లీ అందించిన ఎన్.ఆర్.కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి రంగసామికీ పవన్ అభినందనలు తెలిపారు. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ వైపే ప్రజలు మొగ్గు చూపారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే మంచి విజయాన్ని సాధించిన విజయ్‌ను మనసారా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే- బీజేపీ కూటమి పోరాటం బలంగా సాగిందని, అదే విధంగా కేరళంలోనూ మెజారిటీ ఓటర్లు మార్పునే కోరుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ నాయకత్వానికి కూడా డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల పోరాటంలో విజయం సాధించిన అందరికీ పవన్ కళ్యాణ్ పేరుపేరున శుభాభినందనలు తెలియజేశారు.

# మోడీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం

**విశాఖపట్నం,మనజన ప్రగతి మే 04:** ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలే స్పష్టమైన నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్' లక్ష్యంతో దేశం ముందుకు సాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్ నాయకత్వంపై ప్రజలకు గట్టి నమ్మకం ఉందని వెల్లడించారు. బీజేపీ విజయానికి కృషి చేసిన ప్రతీ నాయకుడు, కార్యకర్తకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లభించిందని.. తమిళనాడులో హంగ్ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉందని మాధవ్ అన్నారు. తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో కూడా బీజేపీ ఓటు శాతంలో గణనీయమైన పెరుగుదల నమోదు అయ్యిందన్నారు. అభివృద్ధి, జాతీయ భద్రత, పారదర్శక పాలనకు ప్రజలు పూర్తి మద్దతు ఇచ్చారన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, డిజిటల్ పురోగతికి దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయన్నారు. యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి మద్దతే విజయానికి కీలకంగా మారిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి.. నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామన్నారు. దేశాభివృద్ధి కోసం అందరూ ఏకమై ముందుకు రావాలని మాధవ్ పిలుపునిచ్చారు.

# మధ్యాహ్న భోజనంలో రాగిజావ కొనసాగింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక పర్యవేక్షణ వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్‌తో కాలపరిమితి ముగిసింది. విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించే ఉద్దేశంతో మరో మూడేళ్లు కొనసాగించాలని విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది.

# నెల్లూరు జిల్లాలో మహానాడు

(మొదటి పేజీ తరువాయి)

వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పుకొచ్చారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) ఉదయం నెల్లూరు జిల్లాలోని దస్తగిరి నగర్‌లో రూ.1.43 కోట్లతో చేపట్టబోయే సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంపై గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్లిందని... పరిశ్రమలు వెళ్లిపోయాయని.. రియల్ ఎస్టేట్ పడిపోయిందని విమర్శించారు. అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని తెలిపారు. యువనేత లోకేశ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏడాది దేశంలో వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని తెలిపారు. పరిశ్రమలు వస్తే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 'మహానాడు ఎక్కడ పెట్టాలో చెప్పటానికి వైసీపీ నేతలు ఎవరు? మా పార్టీ అధినేత నిర్ణయిస్తారు' అని అన్నారు. వైసీపీ తీరు మార్చుకోకపోతే ఆ పదకొండు సీట్లు కూడా ఈసారి రావని.. జనం గుండు సున్నా పెడతారంటూ మంత్రి నారాయణ హెచ్చరించారు.

# బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. 'వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కొందరికి పార్టీలు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారిందని, కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉండన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీఐకి అప్పగించారు. సీబీఐ తన పని తాను చేసుకుపోతుంది. తెలంగాణలో ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ఏం మాట్లాడతాం. సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ అంటున్నారు.. వాస్తవానికి ఆ బియ్యం ఇస్తుంది నరేంద్ర మోదీనే. కేసీఆర్ పెట్టిన పంగనామాలను రేవంత్ రెడ్డి కంటిన్యూ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు.

# అంగన్వాడి టీచర్‌గా పని చేస్తూ చనిపోయిన హేమావతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- హైమావతి కుటుంబానికి ఆర్థిక సహాయం ఐదు లక్షలు ప్రభుత్వం ఇవ్వాలి



**దేవనకొండ మనజన ప్రగతి మే 04:-** దేవనకొండ మండలం కరి వేముల గ్రామంలోఅనారోగ్యంతో మృతి చెందిన అంగన్వాడి టీచర్ హైమావతి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయులతో వారు మాట్లాడుతూ.. దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో అంగన్వాడీ టీచరు గా పనిచేస్తున్న హైమావతి (వయసు 38 సంవత్సరాలు ) 2/5/2026 వ తేదీన శనివారం ఉదయం అంగన్వాడి సెంటర్ లో తీవ్ర అస్వస్థతకు గురి కావడం జరిగిందన్నారు.కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని నిన్న రాత్రి 3:00 గంటల సమయంలో చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించడం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. మృతి చెందిన హైమావతికి భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఐసీడీఎస్ అధికారులు మట్టి ఖర్చులకు తక్షణ సాయం 15000 రూపాయలు అందించాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, అంగన్వాడీలపై ప్రభుత్వం పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, అధికారులు పెట్టే వివిధ ఇబ్బందుల వలన మానసిక ఒత్తిడికి గురై పని భారం తట్టుకోలేక తీవ్ర మనస్థాపాన్ని గురవుతున్నారని తక్షణమే హైమావతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా హైమావతి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 04:-** ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి ఇంచార్జ్ కలెక్టర్ వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇచ్చి, సంతృప్తి శాతం పెంచాలన్నారు. ఎండార్స్మెంట్ స్పష్టంగా ఉండాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఫిర్యాదు అందిన మొదటి రోజే దానిని పరిశీలించి, పరిష్కారానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ పూర్తిగా శాతాన్ని తగ్గించాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ,కొండయ్య, సునీత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తికొండలో పడకేసిన పారిశుద్ధం అధికారుల నిర్లక్ష్యంపై సిపిఐ ఆగ్రహం

- ఎన్ రామాంజనేయులు సిపిఐ పట్టణ కార్యదర్శి సిపిఐ



**పత్తికొండ మన జనప్రగతి మే 04:-** పత్తికొండ పట్టణంలో పారిశుద్ధం పూర్తిగా పడకేసిందని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు రోగాల భారీపడే ప్రమాదం ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారుసోమవారం పత్తికొండ పట్టణంలోని 14 వ వార్డు శ్రీరామ నగర్ ఆంజనేయ నగర్ పరిసర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త చెదారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల గా ఈ ప్రాంతంలో చెత్త సేకరణ జరగకపోవడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా తయారయ్యాయని కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతూ సమస్యలు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు అధికారులు మాటలు పరిమితమైనవని స్వర్ణాంధ్రప్రదేశ్ మరియు చెత్త రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే దానికి పత్తికొండలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని విమర్శించారు ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిలో మూటలని ఎద్దేవా చేశారు అధికారుల నిర్లక్ష్యంతో పారిశుద్ధ అధికారులు పట్టణంలో పారిశుద్ధ పనుల దృష్టి సాధించడం లేదని గత కొన్ని రోజులుగా చెత్త కుప్పలుగా పేరుకుపోయిన పట్టించుకోవడం దారుణం అన్నారు కావున అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే 14 వ వార్డు నందు ఇంటింటికి చెత్త సేకరించి పని పూర్తి చేసి వీధులు పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు పెద్ద ఎత్తున చేస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో 14వ పట్టణవాసులు చిన్న రంగస్వామి వీరన్న ఆంజనేయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 04:-** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.కర్నూల్ కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 111 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్, రామయ్య నాయుడు, రామాశీజులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్**





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 04 :-** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలను ప్రజా ప్రతినిధులతో కలిసిజిల్లా కలెక్టర్ (ఇంచార్జి) పంపిణీ చేశారు.జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సాధారణ వ్యక్తుల మాదిరిగానే దివ్యాంగులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో మూడు చక్రాల మోటార్ సైకిల్ లను 70 మందికి మంజూరు చేసి ప్రతి నియోజకవర్గానికి 10 మందికి చొప్పున పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన 54 మందికి కూడా త్వరితగతిన వాహనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అంద రికీ సమానంగా చేరేలా కార్యక్రమాలు అమలు చేస్తు న్నామని, దివ్యాంగుల హక్కులను పరిరక్షించేందు కు 1993 మరియు 2016 చట్టాల ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. "సుభయాన్అభయాన్" కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అవసరమైన సౌకర్యాలు లేకపోతే తెలియజేస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంఘం నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమస్యలపై చర్చించేందుకు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించేందుకు అంగీకరించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో మిషన్ మోడ్‌లో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు కారుణ్య నియామకాల ద్వారా కూడా దివ్యాం గులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. అయితే నోటిఫికేషన్లకు ఎక్కువగా పట్టణ ప్రాంతాల నుంచే దరఖాస్తులు వస్తుండగా, గ్రామీణ ప్రాంతాల నుంచి తక్కువగా వస్తున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తే వారు కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ (ఇంచార్జి) ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు మెగా కీతో పాటు మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ,కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు,రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల చైర్మన్ నారాయణస్వామి, విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయిస్ ఫాతిమా, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ కే. లక్ష్మీనారాయణ, కర్నూలు తెలుగుదేశం కమిటీ అధ్యక్షులు రవికుమార్, జనసేన రాష్ట్ర విభిన్న ప్రతిభవంతుల నాయకులు నాగరాజు, జిల్లా టిడిపి సాంస్కృతి విభాగపు అధ్యక్షులు పి.హనుమంతరావు చౌదరి , తెలుగుదేశం కార్యదర్శి నాగరాజు, విభిన్న ప్రతిభావంతుల నాయకులు సురేష్ నాయుడు, ఈరన్న ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో ఇద్దరి ప్రేమ కథ విషాదాంతం

**ఆత్మహత్యలతో ముగిసిన ప్రేమ జంట జీవితం**

**చెన్నూరులో విషాదచాయలు**





**చెన్నూరు, మన జనప్రగతి,మే 04:-** ప్రేమించిన ఇద్దరు యువతి యువకులు జీవితాంతం కలిసి జీవించాలని ఎన్నో కలలు కన్నా పరిస్థితులు కాలం వారికి కలసిరాక పోవడంతో చివరకు ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఒకే గ్రామానికి చెందిన యువకుడు, యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరైనప్పటికీ పరస్పరం అర్థం చేసుకుని జీవితాన్ని కలిసి కొనసాగించాలని నిర్ణయించుకున్నారు కానీ విధి వారి జీవితాలను చిద్రం చేసి వారి కుటుంబాలను శోకసముద్రంలో ముంచేసింది, వివరాల్లోకి వెళితే.. చెన్నూరులో ఇద్దరు ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. స్థానికులు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి, చెన్నూరు సరస్వతి నగర్ నివసించే గిరి రాజు కుమారుడు యోగేశ్వర్ రాజు వయసు (20) సంవత్సరాలు కడపలో తన బాబాయ్ ఇంటి వద్ద ఉంటూ నగరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుకుంటూ ఉండేవాడని అయితే ఏమైందో ఏమో కానీ ఆదివారం సాయంత్రం తన బాబాయ్ ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలిసి చెన్నూరు గ్రామానికి గోదిన వీధికి చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మృతుని స్నేహితురాలు హేమ శ్రీ (19 )సంవత్సరాలు తీవ్ర మనోవేదనకు గురై తను ప్రేమించిన యోగేశ్వర్ రాజు ఇక లేడు అని తెలుసుకొని వనస్తపంతో, మనోవేదనతో తన ఇంటిలో సోమవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే వీరు ఇరువురు ప్రేమించుకున్నారని చదువు పూర్తి కాగానే పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకునేందుకు అంగీకారం కూడా లభించిందని ఇంతలో ఏమైందో ఏమో కానీ వారి కలలు చెదిరి వారు తనువు చాలిచారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

కాగా ఇద్దరూ ఒకే చెందినవారు చిన్న వయసులో ఇలా ఆత్మహత్య చేసుకోవడంతో ఇరు కుటుంబాల లోను చెన్నూరు లోవిషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలు హేమశ్రీ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్ పుస్తకాల ఈ కేవైసి పనులు త్వరితగతిన పూర్తి చేయండి: ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 04:-** రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్ పుస్తకాల ఈ కేవైసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ తహసిల్దార్ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో ఇంచార్జి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్ పుస్తకాల ఈ కేవైసి పనులు శనివారం నాటికి పూర్తి చేయాలని గత సమావేశంలో చెప్పినప్పటికీ అనుకున్న స్థాయిలో పురోగతి లేదన్నారు. ఈ కేవైసి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు.పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ నిదానంగా జరుగుతుందని, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. ఫేస్ 3 రీ సర్వే కి సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు.. మ్యుటేషన్ కి సంబంధించి బియాండ్ ఎస్-ఎల్ఏ వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఎట్ టూ వ్యూలో కూడా ఏవి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, ఏడి సర్వే మురళి కృష్ణ, పాల్గొన్నారు.



# ప్రొద్దుటూరులో బీజేపీ సంబరాలు

- పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలో ఎన్‌డిఏ గెలుపు బావుట ఎగరేసిన సందర్భంగా

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 04:-** ప్రొద్దుటూరు నియోజకవర్గం లోని శివాలయం సర్కిల్ నందు బాణసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు చేయటం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ గెలుపు కేవలం జాతీయ వాదుల విజయం కాదు యావద్దేశం మొత్తం ఎదురుచూస్తున్న విజయం అని, వందేమాతరం పుట్టింది కూడా ఈ నేలలోనే, భారత్ మాతాకీ జై అనే నినాదం కూడా ఈ గడ్డపైనే వినిపించింది ఇదే గడ్డపై జనసంఘ్ కు బీజం వేసింది కూడా అని అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఎంత గొప్ప చరిత్ర ఉన్న ఈనేల ఇంతకాలం తప్పుడు దారిలో నడిచింది. దేశం ఎప్పటికీ గుర్తుంచుకునేది మమత బెనర్జీ యొక్క చీకటి ప్రభుత్వం పాలననే మమతా పైనుంచి దుర్మార్గపు పాలనను పాలనను అంతమొదిస్తూ కాషాయ గర్జన చేస్తూ బిజెపి విజయం సాధించడం మనకెంతో గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నరేందర్ రావు, పొద్దుటూరు రూరల్ మండలాధ్యక్షుడు మురళి మోహన్ రెడ్డి, బిజెపి విశ్వహిందూపరిషత్ బజరంగదళ్ నాయకులు పాల్గొన్నారు.


# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ. కోటి విరాళం

• అజ్ఞాత భక్తుడి సేవాభావం



**తిరుమల మన జనప్రగతి మే 04:–** శ్రీవారి సేవలో భాగంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.1 కోటి విరాళం అందజేశారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్‌లో విరాళం డిమాండ్ డ్రాఫ్ట్‌ను సోమవారం టిటిడి ఈవో ఎం. రవిచంద్రకు అందజేశారు. అజ్ఞాత భక్తుడి దాతృత్వాన్ని ఈవో అభినందిస్తూ, అన్నప్రసాద సేవకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

# పులివెందులలో డీడీవోగా వెంకట సుబ్బయ్య నియామకం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–** ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణం పులివెందులలో డీఈవోగా పనిచేస్తున్న విజయలక్ష్మి బదిలీ కాగా ఆస్థానంలో పులివెందులలో నూతన డిడిఓగా వెంకట సుబ్బయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ డిడిఓగా పనిచేసిన విజయలక్ష్మి ప్రమోషన్‌తో ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# డాక్టర్ రవీంద్ర రెడ్డికి ఘనంగా జన్మదిన వేడుకలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–** పులివెందుల పట్టణంలోని స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక రామతులశమ్మ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి,కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ రవీంద్ర రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. సమాజానికి ఆయన అందిస్తున్న వైద్య సేవలు,ముఖ్యంగా నేత్ర సేకరణలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు,సభ్యులు సురేష్,రాఘవేంద్ర రెడ్డి,రాజు,చాంద్ బాషా మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి



**సిద్ధవటం మన జనప్రగతి మే 04:–** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ నియమితులవడం పార్టీకి ఎంతో మేలు చేస్తుందని సిద్ధవటం మండల సీనియర్ టిడిపి నాయకులు, ఇటీవల రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేసిన శనివారపు మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలుపుతూ.. యువగళం పాదయాత్ర ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపి పార్టీని బలోపేతం చేసిన లోకేష్ నాయకత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. తనకు రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపిన మోహన్ రెడ్డి, జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు విజన్ 2047, లోకేష్ యువ నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కష్టపడే కార్యకర్తను గుర్తించి ప్రోత్సహించడం టిడిపి ప్రత్యేకత అని, మై టిడిపి యాప్ లాంటి వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు పార్టీని మరింత చేరువ చేస్తామని వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి రాబోయే ఎన్నికల్లో బూత్ స్థాయిలో అఖండ మెజారిటీ సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 54 మంది లబ్ధిదారులకు రూ.20.67 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం**

**పేదల ఆరోగ్యానికి అండగా ఎన్డీఏ ప్రభుత్వం: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల ప్రాణదాతగా మారుతోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఉద్ఘాటించారు. పేదల పక్షపాతిగా, అభివృద్ధి ప్రదాతగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని ఆయన కొనియాడారు. సోమవారం ఉదయం భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి 54 మంది అనారోగ్య బాధితులకు మంజూరైన మొత్తం రూ. 20,67,595/- విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నేరుగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు మరియు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని చికిత్స కోసం ఏ పేదవాడు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందేలా ప్రజాప్రతినిధులుగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమ కష్ట సమయంలో ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించడం పట్ల లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సాయం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు. పార్టీ నాయకులు జ్ఞానేశ్వర్ నాయుడు,ముచ్చుమర్రి మహేష్,మల్లెల శ్రీను మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి కథనాలు రాస్తే దాడులా..?

**పాత్రికేయుడిపై దాడి తీవ్ర దారుణం**

**ఒక దళిత పాత్రికేయుడిపై ఈ విధంగా హింసకు పాల్పడడం అత్యంత ఖండనీయము**

**దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–** అవినీతి,అక్రమాలపై వార్తా కథనాలు రాసినందుకు పాత్రికేయుడిపై దాడి చేయడం దారుణమని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్‌తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమనం దినపత్రికకు చెందిన పాత్రికేయుడు లక్ష్మీనారాయణపై అనంతపురంలోని శ్రీ గీతం జూనియర్ కళాశాల యాజమాన్యం తరఫున జరిగిన దాడి ఘటనపై దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్‌ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా కళాశాలలో జరుగుతున్న అక్రమాలపై కథనాలు ప్రచురించినందుకు,ఆ యాజమాన్యం అసహనం వ్యక్తం చేస్తూ గుండాలతో కలిసి శనివారం లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి విచక్షణ రహితంగా దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో పాత్రికేయుడిని భయభ్రాంతులకు గురిచేసి, కాళ్లు మొక్కించుకున్న ఘటనలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వార్త తప్పు అనిపిస్తే చట్టపరంగా స్పందించవచ్చని, కానీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులపై దాడి చేయడం పూర్తిగా నేరమని స్పష్టం చేశారు. ఒక దళిత పాత్రికేయుడిపై ఈ విధంగా హింసకు పాల్పడడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలికి తీసే జర్నలిస్టులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోలాప్రసాద్ డిమాండ్ చేసింది. అలాగే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని,రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఈ ఘటనపై స్పందించి బాధ్యత వహించాలని కోరారు. ప్రతి జిల్లాలో కలెక్టర్,ఎస్పీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేశారు.

# ఉజ్వల భవిష్యత్తుకు ఊపిరి పోసే మన సంక్షేమ హాస్టళ్లు

• ప్రకాశం, మార్కాపురం జిల్లాల విద్యార్థులకు సువర్ణావకాశం

• ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రవేశాలు ప్రారంభం



**ఒంగోలు మన జనప్రగతి మే 04:–** ప్రకాశం మరియు మార్కాపురం జిల్లాల్లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు నేడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయి. పేద విద్యార్థుల కలలకు కార్పొరేట్ స్థాయి వసతుల దన్నునిస్తూ, వీటిని కేవలం వసతి కేంద్రాలుగానే కాకుండా ప్రతిభను వెలికితీసే 'ప్రగతి నిలయాలు ' గా తీర్చిదిద్దామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ.ఎన్. లక్ష్మా నాయక్ తెలిపారు. వీటిల్లోకి ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, ప్రభుత్వ వసతులతో ఉన్నతమైన లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు లక్ష్మానాయక్ పిలుపునిచ్చారు. **అత్యుత్తమ ఉత్తీర్ణత** సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో సాధించిన అద్భుత ప్రగతే వీటిల్లోని విద్యా ప్రమాణాలకు నిదర్శనం. మొత్తం 936 మంది హాజరుకాగా 88% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాల్లోని 23 హాస్టళు 100% ఉత్తీర్ణత సాధించాయి. అత్యధికంగా 583 మార్కులతో ప్రభంజనం. తాజా ఫలితాలలో 550 పైగా మార్కులు 58 మందికి, 500-549 మధ్య 137 మందికి లభించాయి. ఏకంగా 772 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలబినవీకరించబడిన భవనాలు, =ా ప్లాంట్ల ద్వారా శుభ్రమైన త్రాగునీరు మరియు సిసి కెమెరాల నిఘాలో పూర్తి భద్రత. వారానికి మూడు సార్లు చికెన్, ఆరు రోజులు గుడ్లు, పండ్లు, చిక్కీలు మరియు రాగి జావతో కూడిన బలవర్ధకమైన ఆహారం బెడ్ షీట్లు, ట్రంక్ బాక్సులు, నోట్ బుక్స్, స్వెటర్లు, టవల్స్, ప్లేట్ మరియు గ్లాస్ ఉచితంగా అందజేయబడతాయి. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేయబడుతుంది. **ప్రవేశాల వివరాలుఅర్హత :** 3వ తరగతి నుండి పీజీ వరకు చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఓబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మీ గ్రామంలోని సచివాలయ వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా, లేదా నేరుగా దగ్గరలోని హాస్టల్ వార్డెన్/అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

# రాజముద్ర తోపట్టాదారు పాసు పుస్తకాలు 1250 మందికి పంపిణీ




**దేవనకొండ మన జనప్రగతి మే 04:–** దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ చేతుల మీదుగా దేవనకొండ మండలం కప్పట్రాల్లా గ్రామంలో 1250 రాజముద్రతో కూడిన రైతు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతుల పాస్ పుస్తకాలపై తమ ఫోటోలు ముద్రించి స్వార్థ రాజకీయాలకు దిగడం తీవ్రంగా ఖండించారు. రైతుల ఆస్తులు, వారి హక్కులపై కూడా వ్యక్తిగత ప్రచారం చేయడం పైశాచిక ఆనందం మాత్రమేనని, ఇది రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు న్యాయం జరిగేలా పలు సంస్కరణలు చేపట్టామని, అందులో భాగంగా రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించడం ద్వారా రైతుల హక్కులను, గౌరవాన్ని పునరుద్ధరించామని తెలిపారు. ఇకపై రైతుల పేరుతో ఎలాంటి రాజకీయ లాభాలు పొందేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందుంటామని చెప్పారు. అదేవిధంగా దేవనకొండ మండలంలో సాగు నీటి పారుదల, త్రాగునీటి సదుపాయాలు, రైతు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రైతు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# సింహాద్రిపురంలో టీటీడీ ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి ధార్మిక కార్యక్రమాలు



**సింహాద్రిపురం మన జనప్రగతి మే 04:** స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ )హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విశేష ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గంగిరెడ్డి రామచంద్రారెడ్డి మరియు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ఐదు రోజుల కార్యక్రమాలు నేటి రాత్రి 7 గంటలకు రామాయణం అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం,అనంతరం భజన కార్యక్రమం,మే 6 (బుధవారం) మహాభారతం పై ఉపన్యాసం మరియు భజనలు,మే 7 (గురువారం) భగవద్గీత విశిష్టతపై ఉపన్యాసం మరియు భజన కార్యక్రమం,మే 8 (శుక్రవారం) స్థానిక మహిళలు మరియు కన్యలచే విశేష కుంకుమార్చన,భజన మండలి సభ్యులతో సంకీర్తనలు,మే 9 (శనివారం)సామూహిక భజనలు మరియు మంగళహారతులతో ధార్మిక కార్యక్రమాలు ముగియనున్నాయని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో టీటీడీ ధర్మాచార్యులు గోపాలకృష్ణ స్వామి,ఓం ప్రకాష్ మరియు శివ స్వాములు పాల్గొని భక్తులకు హితోపదేశం చేయనున్నారు. ఈ ధార్మిక కార్యక్రమాల్లో మండలంలోని భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని,ఆధ్యాత్మిక ప్రసంగాలను ఆలకించి శ్రీ వేణుగోపాల స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

# ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి పార్ట్ టైం ఉపాధ్యాయుల విన్నపం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–** సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పులివెందులలోని ఎమ్మెల్సీ నివాసంలో భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులు తమ వినతిపత్రంలో ప్రధానంగా ఉద్యోగ భద్రత ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న పార్ట్ టైం టీచర్లకు తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రతి నెలా జాప్యం లేకుండా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని,విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఎలాంటి ఆలస్యం లేకుండా రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఎదుర్కొంటున్న ఇతర మౌలిక మరియు వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వ అధికారులతో చర్చించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురు రత్నం,అమరనాథ్ రెడ్డి, నాగేంద్ర,ఆదినారాయణ రెడ్డి, ప్రవీణ్ కుమార్,తిరుపాల్, ఉత్తయ్య,లక్ష్మి,గిరిజా కుమారి, కుర్షద్,సుబ్బారెడ్డి,బాలయ్య, రాజు మరియు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# రాజోలు శాఖ గ్రంథాలయాన్ని సందర్శించిన భూపతిరాజు



**కాకినాడ మన జనప్రగతి మే 04:–** రాజోలు శాఖ గ్రంథాలయమునకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతి రాజు ఈశ్వర్ రాజు( సాయిబాబా రాజు ) రాజోలు గ్రేట్ టు గ్రంథాలయమును సందర్శించి వేసవి శిక్షణ తరగతులకు వచ్చిన పిల్లలతో మాట్లాడి పిల్లల ప్రదర్శనలు తిలకించి పిల్లలకు వివిధ అంశములలో శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్స్ తో ముచ్చటించారు. ఆయన పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలకు విద్యార్థిని విద్యార్థులంతా గ్రంథాలయానికి వచ్చి ఇక్కడ జరిగే శిక్షణా తరగతులలో అన్ని అంశాలు నేర్చుకోవాలని తెలియజేశారు అన్ని విషయాలలోనూ సహాయ సహకారములు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి రమణ. అనుచూరి రామపురిషోత్తం. పట్నాల శ్రీనివాస్. ధరణి ప్రగడ వంశీకృష్ణ. షేక్ ఇస్మాయిల్ . తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -05-2026

## శివాల్ పల్లె లోఉపాధి కూలీలకు లస్సి ప్యాకెట్ల పంపిణీ చేసిన ఆధ్యాత్మికవేత్త పొట్టి పాటి ప్రతాప్ రెడ్డి



**చెన్నూరు మన జనప్రగతి మే 04:–**చెన్నూరు మండలం శివాల్ పల్లి గ్రామపంచాయితీ పరిధిలో సోమవారం ఉదయం వ్యవసాయ పంటపోలల్లో పంటకాలువలు లోఉపాధి పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి( ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయం వ్యవస్థాపకులు. ఆధ్యాత్మికవేత్త. పొట్టి పాటి ప్రతాపరెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు కు లీకులు లస్సి ప్యాకెట్లు పంపిణీ చేశారు. శివాలపల్లి. దళితవాడ. గోపవరం గ్రామానికి చెందిన 150 మంది ఉపాధి కూలీలు పంటకాలువలు నందు ఉపాధి పనులు చేస్తున్నారు. ఎండ వేడిమి తో పనులు చేస్తున్న కూలీలను చూసి ప్రతాపరెడ్డి మానవతాదృష్టితో వారికి దప్పిక తీర్చేందుకు లస్సి ప్యాకెట్లు పంపిణీ చేశారు. వంటకాలలో మూడు చోట్ల ఉపాధి పనులు చేపడుతున్న వారి దగ్గరికి వెళ్లి లస్సి ప్యాకెట్లు అందించారు. కూలీలకు సేద తీర్చేందుకు వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదంతో శనివారం ఉపాధి పనులు చేస్తున్నకులీలకు మజ్జిగ పంపిణీ చేయగా ప్రస్తుతం రెండో విడత కూలీలకు లస్సిప్యాకెట్ల అందజెశారు. ప్రతాప్ రెడ్డి మజ్జిగ లస్సిప్యాకెట్ల అందజెయడంతో చేయడంతో ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదం ఆయన కటాక్షం వల్ల ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, నంద్యాల చంద్రశేఖర్ మెట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

### ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా రైతులకు శిక్షణ



**సింహాద్రిపురం మన జనప్రగతి మే 04:–**మండలంలోని గురజాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అంశాలపై మరియు ఎల్–నినో ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి,ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. సోమవారం జరిగిన మొదటి రోజు శిక్షణలో వ్యవసాయ అధికారులు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ.రామాంజుల రెడ్డి మాట్లాడుతూ ఎల్–నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు.కాబట్టి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా తక్కువ నీటితో సాగయ్యే జొన్న, ఆముదం,కంది వంటి పంటలను సాగు చేయాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకతను వివరించారు.ముఖ్యంగా ఏ.టి.ఎం (ఎనీ టైం మనీ ) మరియు పి.ఎం.డి.ఎస్ నమూనాల ద్వారా మెరుగైన ఫలితాలు ఎలా సాధించవచ్చో సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.రామాంజుల రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా విశేష పూజలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–**పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో వెలసిన అతి పురాతన,ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు.సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర,శివ స్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా వివిధ అభిషేకాలు,అర్చనలు జరిగాయి.పంచామృత అభిషేకం మరియు భస్మాభిషేకం,సహస్ర నామ అష్టోత్తర శతనామావళి,లింగాష్టకం మరియు భీష్మాభిషేకం,పూజా కైకర్యాల అనంతరం మిట్టమల్లేశ్వర స్వామి వారు భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.సోమవారం కావడంతో పట్టణంలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయంలో ప్రతిరోజూ ధూప, దీప,నైవేద్యాలతో పాటు విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నాం అని స్వామివారిపై నమ్మకంతో భక్తులు భారీగా తరలిరావడం సంతోషకరం అని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.దర్శనం అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది,ఆలయ కమిటీ సభ్యులు మరియు అధిక సంఖ్యలో శివ భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## ఏపీ ఉర్దూ అకాడమీ నూతన బాధ్యుల ప్రమాణ స్వీకారం



**మంగళగిరి మన జనప్రగతి మే 04:–** ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ కి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన సభ్యుల బాధ్యతల స్వీకార మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది.మంగళగిరిలోని టీవీఎస్ షోరూం పైన ఉన్న అకాడమీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.అకాడమీ గౌరవ చైర్మన్ ఫరూఖ్ షిబ్లీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.పఠాన్ ఖాదర్ ఖాన్ (మదనపల్లి) ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్‌గా,హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాషా (పులివెందుల)బోర్డు మెంబర్‌గా బాధ్యతలు చేపట్టారు.సోమవారం ఉదయం 11:30 గంటలకు ఈ బాధ్యతల స్వీకార కార్యక్రమం జరిగింది.రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి,అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి నూతన పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా ప్రతినిధులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది,పలువురు నేతలు మరియు అభిమానులు పాల్గొని నూతన బాధ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే సుస్థిర సాగు: ఏడిఏ ప్రభాకర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:–** రానున్న కాలంలో ప్రకృతి వ్యవసాయమే రైతులకు శరణ్యమని,తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఏ) ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనశిక్షణలో భాగంగా మొదటి రోజు పులివెందుల మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో పర్యటించారు. అక్కడ పి.ఎం.డి.ఎస్ విధానం ద్వారా సాగు చేసిన వివిధ రకాల పంటలను అధికారులు మరియు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి వనరులను ఉపయోగించుకుంటూ భూసారాన్ని ఎలా పెంపొందించవచ్చో ప్రత్యక్షంగా వివరించారు.రైతులకు అవగాహన కల్పించాల్సిన ముఖ్యమైన పద్ధతులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ద్రవ జీవామృతం మరియు ఘన జీవామృతం తయారీ, దాని విశిష్టత,ముందస్తు ఖరీఫ్ సన్నద్ధతలో భాగంగా పి.ఎం.డి.ఎస్ పద్ధతిని పాటించడం,ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో నవధాన్యాలను విత్తన గుళికలుగా చేసి,ఖాళీ భూముల్లో చల్లడం ద్వారా నిస్సారమైన భూములను సారవంతం చేయడం,5 అంతస్తుల సాగు నమూనా ద్వారా తక్కువ విస్తీర్ణంలో అరటి,బత్తాయి వంటి పంటల ద్వారా అధిక లాభాలు పొందడం ప్రధానాంశాలు గా శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఏడిఏ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి సిద్ధమైన పద్ధతులతో భూసారాన్ని కాపాడాలని సూచించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి,మోడల్ మేకర్ యామిని లత,రైతు సేవా కేంద్రాల సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయం పాటించడం వల్ల భూమి సారవంతం

### ● చెన్నూరు మండల వ్యవసాయ అధికారి. కే శ్రీదేవి



**చెన్నూరు, మన జన ప్రగతి మే 04:–** రైతులు పకృతి వ్యవసాయం పాటించడం వలన భూమి సారవంతమై నెలలో సుఖ జీవుల సంఖ్య పెరిగి వాన పాములు సమృద్ధిగా పెరుగుతాయని వీటివల్ల మొక్క ఆరోగ్యం పెరుగుతుందని చెన్నూరు మండల వ్యవసాయ అధికారి కే శ్రీదేవి తెలిపారు. చెన్నూరు మండలం బయనపల్లె (కొండ పేట) గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్మెంట్ న్యాచురల్ పామింగ్– నేషనల్ మిషన్ అన్ నాచురల్ ప్లంబింగ్ కింద ఈనెల నాలుగు ఐదో తేదీలు రెండు రోజులపాటు కమ్యూనిటీ రీసెర్చ్ పర్సన్. మరియు గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటిరోజు ప్రీమన్ సున్ డ్రై షోయింగ్ ప్రదర్శనక్షత్రాన్ని ఏటీఎం( ఎనీ టైం మనీ) ప్రదర్శనక్షత్రాన్ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీదేవి మాట్లాడుతూ పిఎండిఎస్ కింద పప్పు ధాన్యాలు చిరుధాన్యాలు నూనె గింజలు సుగంధ ద్రవ్యాలు పచ్చ రొట్టె కూరగాయలు వంటివి 25 నుంచి 30 ఎకరాలకు విత్తనాలను ఎకరాకు 25 కిలోల విత్తన మిశ్రమాన్ని ప్రధాన పంటగా వేసుకోవాలని ముందుగా పొలంలో వెదజల్లుకోవాలని సూచించారు. ఈ రకంగా చేయడం వలన 365 రోజులు పంటలో కప్పబడి ఉంటుందన్నారు డి ఎం ఎంటి గంగిరెడ్డి వర్షపావ పరిస్థితిలో విత్తనము బీజవృతం బంకమల్లు ఘన జీవ అమృతం బూడిద వంటి వాటిలో విత్తన గుల్కలు తయారు చేసుకొని భూమిపై చల్లాలన్నారు. వెంకటయ్య శ్రీనివాసులు వ్యవసాయ సిబ్బంది రైతులు ట్రైనీలు పాల్గొన్నారు.

## నెల్లూరులో భారీ అగ్నిప్రమాదం

### మంత్రి నారాయణ ఆదేశాలతో రంగంలోకి అన్నంగి ప్రసాద్ బృందం

### సమయస్ఫూర్తితో నలుగురికి తప్పిన ప్రాణాపాయం



**నెల్లూరు మన జనప్రగతి మే 04:–** సిటీ 39వ డివిజన్ మూలాపేటలోని బ్రాహ్మణ వీధిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది.మంత్రి నారాయణ ఆదేశాల మేరకు 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ అన్నంగి ప్రసాద్ వారి బృందం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు హజ్రత్ ఇల్లు మంటల్లో చిక్కుకుంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారాయణ తక్షణమే స్పందించి, బాధితులకు అండగా నిలవాలని అ ప్రాంత టీడీపీ నేత అన్నంగి ప్రసాద్ ను ఆదేశించారు.ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్నంగి ప్రసాద్ తన బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఇంట్లో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులను ప్రాణాపాయం నుండి క్షేమంగా బయటకు తీసుకువచ్చారు..సహాయక చర్యల్లో మైనారిటీ నాయకుడు రెహమాన్ వారి మిత్ర బృందం ప్రాణాలకు తెగించి పోరాడటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.మంటల తీవ్రతకు ఇంట్లోని ఏసీలు, ఫ్రిజ్, ఫర్నీచర్ సహా సుమారు 20 లక్షల విలువైన ఆస్తి కాలి బూడిదైంది. అనారోగ్య కారణాలతో రిటైర్మెంట్ తీసుకున్న హజ్రత్ కుటుంబం ఈ నష్టంతో ఆందోళన చెందుతోంది.మంత్రి నారాయణ మార్గదర్శకత్వంలో టీడీపీ నేతలు చూపిన చొరవను, వారి బృందం చేసిన కృషిని స్థానికులు కొనియాడుతున్నారు.సర్వం కోల్పోయిన ఈ పేద రిటైర్డ్ టీచర్ కుటుంబానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గంజా మనోహర్,దూజ మురళి కృష్ణ సింగ్,మిర్యాల దీనదయాల్,మైనారిటీ నాయకులు రెహమాన్, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధవటం డిప్యూటీ రేంజర్ ఓబులేసుకు పదోన్నతి ముద్దునూరు రేంజర్‌గా నియామకం



**సిద్ధవటం మన జనప్రగతి మే 04:–** సిద్ధవటం అటవీశాఖలో డిప్యూటీ రేంజర్ గా సేవలందిస్తున్న కె. ఓబులేసు పదోన్నతి పొందారు. సీనియారిటీ ప్రాతిపదికన ఆయనను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ, ముద్దునూరు రేంజర్ గా పోస్టింగ్ ఇస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతి రావు ఆదేశాలు జారీ చేశారు.ఓబులేసు జూలై 9, 2022 నుండి సిద్ధవటంలో డిప్యూటీ రేంజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2025–26 పదోన్నతి ప్యానల్ జాబితా ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 30న ఆయనకు ఈ ప్రమోషన్ లభించింది. త్వరలోనే ఆయన ముద్దునూరు రేంజ్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సిద్ధవటంలో ఉచిత వైద్య శిబిరం

### - దురలవాట్లకు దూరంగా ఉండాలని డాక్టర్ల సూచన



**సిద్ధవటం మన జనప్రగతి మే 04:–** మండల కేంద్రంలోని దిగుపేటలో పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో భాగంగా, 60 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్, మరియు మొబైల్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0లో భాగంగా వైద్యులు అవగాహన కల్పిస్తూ, మధుమేహం, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ, ఎండల తీవ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


## వైభవంగా ముగిసిన మాచుపల్లి రేణుక ఎల్లమ్మ తిరుణాల

### - వసంతోత్సవంలో మునిగితేలిన భక్తులు



**సిద్ధవటం మన జనప్రగతి మే 04:–** మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తిరుణాల మహోత్సవం సోమవారం వసంతోత్సవంతో అత్యంత వైభవంగా ముగిసింది. ఏప్రిల్ 30న ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా చివరి రోజు అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని గ్రామోత్సవంగా ఊరేగించారు. ఆలయ అర్చకులు రాజు మాట్లాడుతూ.. గ్రామ పెద్దల సహకారంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, తిరుణాల విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఎస్.ఐ హారిక ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించడంతో వేడుకలు ప్రశాంతంగా సాగాయి.

## మాజీ మంత్రికి ఘన స్వాగతం



**మార్కాపురం మన జనప్రగతి మే 04:–** వైఎస్సార్సీపీ నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి యాదవ శ్రేయోభిలాషి కామూరు నాగేశ్వరరావు యాదవ్ హాజరయ్యారు. ప్రస్తుతం పార్టీ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన రాకతో కార్యక్రమానికి ప్రత్యేక ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు మరియు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, కడెం వెంకటేశ్వర్లు యాదవ్, బోరి గొర్ల అజయ్ యాదవ్ తదితరులు సాలువాతో సత్కరించి గజమాలతో అభినందనలు తెలియజేశారు.కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, పార్టీ బలోపేతం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై చర్చలు జరిగినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశం ద్వారా వైఎస్సార్సీపీలో ఐక్యత, కార్యకర్తల ఉత్సాహం మరింత పెరిగినట్లు స్పష్టమైంది.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -05-2026

## వేసవిలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**● ఎస్సై హారిక హెచ్చరిక**



**సిద్ధవటం మన జనప్రగతి మే 04:-** వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఎస్సై హారిక సోమవారం సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వేసవి సెలవుల కోసం మూసివే యడంతో పిల్లలు పెన్నా నది పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు నిఘా ఉంచాలని ఆమె తెలిపారు. అదేవిధంగా అవగాహన లేకుండా విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఈ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మే 31న పద్మశాలియ విద్యార్థులకు స్కాలర్షిప్స్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 04:-** పద్మశాలియ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్స్ మే 31న స్థానిక పద్మశాలియ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వద్ది నరసింహులు తెలిపారు. ఇంటర్, 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.3,000 నుంచి రూ.5,000 వరకు నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈఏపీసెట్, నీట్, జేఈఈలో మెరుగైన ర్యాంకులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నారు. అర్హులైన విద్యార్థులు మే 20లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9032705866,9290571411 నంబర్లను సంప్రదించవచ్చు.

## శివోహం సేవకు ఆటంకం!

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 04:-** శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారు దాదాపు గత 5 సంవత్సరాలుగా స్థానిక అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద సేవను ఈ సోమవారం నిర్వహించడం లేదని విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాదానంగా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు అయిదు సంవత్సరాల నుండి శివాలయం ఆవరణంలో నిరాటంకంగా నిర్వహిస్తూ వచ్చిన ఈ కార్యక్రమం ప్రస్తుతం శివాలయం ఆవరణంలో కాకుండా మరో ప్రదేశంలో నిర్వహించు కోవాలని ప్రస్తుత పాలకమండలి ఛైర్మన్ వంగల నారాయణ రెడ్డి తమ సంఘం ఉపాధ్యక్షులు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, జగన్ మోహన్ రెడ్డి కి తెలిపారని, దీంతో హైదరాబాద్ లో వున్న తాను ఈ ప్రకటన విడుదల చేసినట్లు వివరించారు. కాగా తాను త్వరలోనే ప్రొద్దుటూరు కు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

## ఆధ్యాత్మిక పరీక్షల్లోను రాజు విద్యార్థులు అద్భుతాలు

**- రాజు విద్యా సంస్థల కార్యనిర్వాహక కార్యదర్శి చమర్తి లోకేష్ రాజు**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మే 04:-** రాజు విద్యా సంస్థల విద్యార్థులు ఆధ్యాత్మిక పరీక్షల్లోనూ అద్భుతాలు సృష్టిస్తున్నారని రాజు విద్యాసంస్థల కార్యనిర్వాహక కార్యదర్శి చమర్తి లోకేష్ రాజు అన్నారు. సోమవారం అయన శ్రీ రాజు స్కూల్ లో విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ ఆధ్వర్యంలో వ్యాల్యూ ఎడ్యుకేషన్ కంటెస్ట్(బేస్డ్ ఆన్ గీత)వారు నిర్వహించిన ఆధ్యాత్మిక పోటి పరీక్షలలో శ్రీ రాజు హైస్కూల్ కు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని కె.సరయు అన్నమయ్య జిల్లా స్థాయిలో ప్రధమ బహుమతిని పూజ్యశ్రీ రేవతి రమన్ ప్రభు(ఇస్కాన్ టెంపుల్,తిరుపతి)చేతుల మీదుగా అందుకున్నారన్నారు. మా విద్యార్థులు పోటి పరీక్షలలోనే కాకుండా ఆధ్యాత్మిక పరీక్షలలో కూడా ముందు వరుసలో ఉంటారని తెలపారు. అనంతరం ఆ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.రమణయ్య,ఇంచార్జ్ ఉమా మహేశ్వరి,అధ్యాపకులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలి

**● బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే సహించేది లేదు: ఏడీఏ ప్రభాకర్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:-** రైతులకు సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు మరియు పురుగు మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సహాయ సంచాలకులు (నాణా) ప్రభాకర్ రెడ్డి డీలర్లను ఆదేశించారు. సోమవారం పులివెందుల మినీ సచివాలయములోని ఏడీఏ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పులివెందుల వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా ప్రస్తుతం 500 మెట్రిక్ టన్నుల యూరియా,600 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు,విత్తనాలను విక్రయించాలని అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి విక్రయం తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానం (e`PoS మిషన్) ద్వారానే జరగాలని,స్టాక్ రిజిస్టర్లు మరియు రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు అతిక్రమించి అక్రమాలకు పాల్పడే దుకాణదారుల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువుల సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకున్నడ,కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా సహించేది లేదని సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి మరియు పులివెందుల మండలంలోని వివిధ ఎరువులు,విత్తనాల దుకాణదారులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న గురుకుల సిబ్బంది

**దివంగత టీచర్ కుటుంబానికి రూ.1.30 లక్షల ఆర్థిక సాయం**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:-**తోటి ఉద్యోగి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి మేమున్నామంటూ ఇపట్ల గురుకుల పాఠశాల సిబ్బంది తమ ఉదారతను చాటుకున్నారు. అకాల మరణం చెందిన టీచర్ సుభాన్ బీ కుటుంబానికి సేకరించిన విరాళాన్ని సోమవారం అందజేశారు. ఇపట్ల గురుకుల పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న సుభాన్ బీ ఇటీవల హఠాన్మరణం చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె మరణంతో ఇద్దరు ఆడపిల్లలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది,తోటి ఉపాధ్యాయులు స్పందించి తమ వంతుగా రూ.1,30,000 విరాళాన్ని సేకరించారు. సోమవారం పులివెందులలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ఈ నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సహోద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు తోటి సిబ్బంది ఇలా అండగా నిలవడం అభినందనీయం అని ఆ ఇద్దరు ఆడపిల్లల చదువుకు,భవిష్యత్తుకు నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురు రత్నం, అమరనాధ్ రెడ్డి,నాగేంద్ర, ఆదినారాయణ రెడ్డి,ప్రవీణ్ కుమార్,తిరుపాల్,ఉత్తయ్య, లక్ష్మి,గిరిజా కుమారి,కుర్షద్, సుబ్బారెడ్డి,బాలయ్య,రాజు మరియు ఇపట్ల గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సుగవాసి పాలకొండరాయుడు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు చెక్కులు బహుమతి పంపిణీ




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మే 04:-** ఎ.పి ఎస్ఎస్‌సి 2026 ఫలితాల్లో సుగవాసి రాజారామ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, సుగవాసి పాలకొండరాయుడు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు ఈ సందర్భంగా మాసాపేటలోని సుగవాసి రాజారామ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాద్ బాబు టాపర్స్‌కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి చెక్కు రూపంలో బహుమతులు అందజేశారు. టాపర్స్‌కు చెక్కు బహుమతులు: 1ర: సుష్మ తాజ్ 590/600 మార్కులు ₹20,000 చెక్కు. 2అం: బుసిరెడ్డి చైత్రశ్రీ 554/600 మార్కులు ₹10,000 చెక్కు 3తీం: చెప్పలి హప్స 541/600 మార్కులు ₹5,000 చెక్కు 3తీం: నూనె రుషేంద్ర 541/600 మార్కులు ₹5,000 చెక్కు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రసాద్ బాబు మాట్లాడుతూ,"విద్యార్థులు రాత్రింబవళ్ళు కష్టపడి చదివి సాధించిన ఈ విజయం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు గర్వకారణం. భవిష్యత్తులో ఇంకా పట్టుదలతో కృషి చేసి ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని ఆకాంక్షించారు. అలాగే ఈ గొప్ప విజయానికి కారణమైన ఉపాధ్యాయుల సేవలు, తల్లిదండ్రుల సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. చంద్రబాబు నాయుడు లోకేష్ నాయకత్వంపై ప్రశంసలు:ప్రసాద్ బాబు మాట్లాడుతూ,"తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు విద్యకు ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన దూరదృష్టి గల నాయకుడు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా అనేక సంస్కరణలు అమలు చేసి రాష్ట్ర విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. అలాగే యువ నాయకులు విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ విద్యారంగాన్ని ఆధునికీకరణ దిశగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తూ, విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించే విధంగా ముందడుగు వేస్తున్నారు. చంద్రబాబు విజన్ లోకేష్ గారి మిషన్ వల్లే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మరింత బలోపేతమై పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా టీడీపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది"లిలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇలియాస్ , స్కూల్ కమిటీ చైర్మన్ సుగవాసి ఆనంద్ కుమార్, సుగవాసి శ్రీనివాసులు, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, వెంకట శివయ్య, మన్నేరు రామాంజనేయులు, ప్రదీప్, నాగచైతన్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్లు అందజేసిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, మన జనప్రగతి మే 04:-** సోమవారం కాకినాడ కలెక్టరేట్లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు 6.లక్షల 15 వేల విలువైన ల్యాప్ టాప్లు, మొబైల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏవై శ్రీనివాసుతో కలిసి ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, ఆపైన చదువుతున్న దివ్యాంగులకు, 45 వేల విలువైన ల్యాప్ టాప్, పదో తరగతి ఆ పైన చదువుతున్న బధిరులకు15 వేల విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందించారు. సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 11 మందికి ల్యాప్ టాపులు, ఎనిమిది మందికి మొబైల్ ఫోన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని 6 లక్షల 15 వేల విలువైన ల్యాప్ టాపులు, మొబైల్ ఫోన్లు ఉచితంగా విద్యార్థులకు అందించిందన్నారు. దివ్యాంగ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా టి తిప్పేనాయక్, విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఉండ్రాజుపు రాజు, వివిధ శాఖల అధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత వివాదాలే ఈ ఘటనకు కారణం

**● టీడీపీ నేత కసిరెడ్డి వెంకట శివారెడ్డి**



**గాలివీడు మన జనప్రగతి మే 04:-** రాయచోటిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి పై జరిగిన దాడి ఘటనను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికు సంబంధం ఉందంటూ ఆయనపై రుద్దడం సరికాదని గాలివీడు మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనకు రాయచోటి ఎమ్మెల్యే అయిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లేదా ఆయన అనుచరులతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా, పార్టీ నాయకులు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దశరథరామిరెడ్డి వ్యక్తిగత, ఆర్థిక, రాజకీయ వివాదాల్లో తరచూ ఇరుకు గా ఉండే వ్యక్తి అని, కుటుంబ వివాదాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, పెట్రోల్ బంక్ తదితర అంశాల్లో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి వివాదాస్పద వ్యక్తిపై జరిగిన దాడిని రాజకీయంగా మలిచి మంత్రిపై నిందలు వేయడం తగదన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను గౌరవిస్తూ సంబంధిత పనులను నిలిపివేశారని, చట్టపరమైన మార్గంలోనే ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. రాయచోటిలో ఏ చిన్న సంఘటన జరిగినా మంత్రి పేరును లాగడం వైఎస్ఆర్సిపి నాయకులకు అలవాటైపోయిందని విమర్శించారు. నిజానిజాలు వెలుగులోకి వచ్చిన తర్వాత మాట్లాడటం మంచిదని సూచించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలని, రాజకీయ లాభాల కోసం అసత్య ప్రచారాలను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

## 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ ప్రశంసలు అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య స్టాప్ రిపోర్టర్ మన జనప్రగతి 04:-** 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారి కృషి, పట్టుదల, క్రమశిక్షణనే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. జిల్లాలో ఈసారి సాధించిన 10వ తరగతి ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని అన్నారు. ఇంటర్‌మీడియట్‌లో తమ ఆసక్తి, లక్ష్యాలకు అనుగుణంగా సబ్జెక్టులను ఎంపిక చేసుకుని, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అభినందించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు:ఆర్.డి. వైష్ణవి 595/600, జెడ్పీ ఉన్నత పాఠశాల, కోటపల్లి బాలికలు (పీలేరు మండలం) జి. ఆది విష్ణు 592/600, వివేకానంద మునిసిపల్ హైస్కూల్, మదనపల్లెజి. కీర్తన 591/600, ఏపీ మోడల్ స్కూల్, చిన్నమండెండి. అఖిల 591/600, ఏపీ మోడల్ స్కూల్, పెనగలూరుఎన్. సుష్మా తాజ్ 590/600, జెడ్పీ ఉన్నత పాఠశాల, మాసాపేట (రాయచోటి మండలం)జిల్లా యంత్రాంగం తరపున విజేతలందరికీ కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనురాధ, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సాధిస్తున్న అద్భుత విజయాలు



**పత్తికొండ మన జనప్రగతి మే 04:-** నేపథ్యంలో ఈరోజు పత్తికొండలో బిజెపి పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ అనంతరం విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మూడు రాష్ట్రాల్లో భారీ విజయకేతనం ఎగురవేసిన భారతీయ జనతా పార్టీ విజయాన్ని పురస్కరించుకుని బీజేపీ శ్రేణులు ఉత్సాహభరితంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం పత్తికొండ బీజేపీ మండల అధ్యక్షుడు కరణం నరేష్ ఆధ్వర్యంలో జరిగింది. బైక్ ర్యాలీగా ప్రారంభమైన ఈ విజయోత్సవం పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఘనంగా కొనసాగింది. కార్యకర్తలు భారీగా పాల్గొని జై బీజేపీ నినాదాలతో పట్టణ ప్రధాన రోడ్డులో నినాదాలతో మార్మోగాయి. అనంతరం భానుసంచా పేల్చి, ప్రజలకు మిఠాయిలు పంచుతూ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు మాట్లాడుతూ: భారతదేశ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన బాంగ్లాదేశ్ ప్రజలు తమ ఓటుతో మన దేశాన్ని కాపాడేది, మనల్ని కాపాడేది భాజపాయే, నరేంద్ర మోడీయే అని గుర్తించి ఓట్లు వేశారని, ఆ రాష్ట్ర భాజపా నాయకులు, కార్యకర్తలు ప్రాణాలొడ్డి కష్టపడి గెలుపు కోసం కృషి చేసి సరికొత్త రికార్డు సాధించి పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని అత్యధిక సీట్లతో గెలిచి కైవసం చేసుకుని మొట్టమొదటిసారిగా బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని. దేశ ప్రజలు అభివృద్ధి, సుస్థిర పరిపాలనకు మద్దతుగా భారతీయ జనతా పార్టీకి మరోసారి అఖండ విజయాన్ని అందించారని తెలిపారు. ప్రధాని నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం రోజురోజుకీ పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ విజయాలు భవిష్యత్తులో మరింత పెద్ద విజయాలకు బాటలు వేస్తాయని అన్నారు. పత్తికొండలో కూడా బీజేపీ శక్తిని మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామాంజనేయులు రామాంజనేయులు, దండి మల్లికార్జున పూనా మల్లికార్జున, రాంపల్లి రంగయ్య, లక్ష్మణరావు అడ్వకేట్ నాగేష్, సీసీ రంగన్న, నరసింహులు,మాలేకర్ విరేష్, సురేష్ నాయక్ భగవాన్ రావు, రవీంద్ర, రామ్ నాయుడు, తిమ్మరాజు, రామ్ చరణ్, ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కంటి వైద్య సేవలు భేష్



**పత్తికొండ మన జనప్రగతి మే 04:-** పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు మరియు యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం యొక్క సేవలు బాగున్నాయని సీనియర్ లెక్చరర్ వీరేశప్ప, తుగ్గలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సుధాకర్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి వారు అత్యాధునిక పరికరాలతో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేశప్ప మరియు స్కూల్ అసిస్టెంట్ సుధాకర్ గౌడ్ ప్రజలకు అన్నదానం, బెంగళూరు వాసవి అన్నదాన ట్రస్ట్ నిర్వాహకులు సీతారామ్ వారు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉదయం 21 మందికి ఆపరేషన్ లు మరియు దాదాపు 132 మందికి వైద్య పరీక్షలు చేశామని శంకర నేత్రాలయ ఆసుపత్రి కోఆర్డినేటర్స్ అరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ స్పందన సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సురేంద్ర, లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, సభ్యులు మధు, రమేష్, గిరి, జిలాన్, రాజేశ్వరి, వాలంటీర్లు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


# నగరపాలక సంస్థకు 36 వినతులు: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి మే 04:-** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 26మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా ఎస్. టి. వి. నగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయాలని, యూడీఎస్, రోడ్లు మరమ్మతులు చేయాలని, రవీంద్ర నగర్ నందు ఆగిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, ఎల్. ఆర్. ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని, పి ఎస్ 4 హోటల్ వెనుక జరుగుతున్న అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, నెహ్రూ నగర్ లోని మా ఇంటి ముందు చెత్త వేయడం వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, ఉపాధ్యాయ నగర్ వద్ద గాలి వానకు పడిపోయిన చెట్లు తొలగించాలని, నరసింహ తీర్థం రోడ్డులోని కర్మక్రియల భవనం మరమ్మతులు చేయించాలని, ఎమ్మార్ పల్లి తేజస్వి స్కూల్ వద్ద కాలువలు శుభ్రం చేయాలని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్కానింగ్ సెంటర్ల తనిఖీ

- లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజ్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 04:-** వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజ్ ఆదేశాల మేరకు పులివెందులలో స్కానింగ్ సెంటర్లో హాస్పిటల్ తనిఖీలు నిర్వహించారు. కడప జిల్లా పరిధిలోని పులివెందుల డివిజన్ లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజ్ ఆదేశాల మేరకు డిప్యూటీ డి యమ్ ఎఫ్ ఓ ఖజా మోద్దీన్ మరియు డిప్యూటీ డెమో ప్రసన్నలత బాలాజీ నర్సింగ్ హోమ్ మరియు వరసిద్ద వినాయక స్కాన్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యానికి తగు సూచనలు చేస్తూ మిషన్స్ వద్ద బయట తప్పనిసరిగా ఐ ఈ సి డిస్ప్లే ఉంచాలని,బయట అందరికీ కనిపించేలాగా ప్రైస్ లిస్ట్ పెట్టాలని,ఎవరికైనా గర్భస్థ లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే సదరు స్కాన్ సెంటర్ ని ప్రభుత్వాన్ని నిబంధనలు ప్రకారం సీజ్ చేస్తామని, స్కానింగ్ సెంటర్స్ ప్రాంగణం లో సీసీటీవీ తప్పనిసరిగా ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# కేరళలో కాంగ్రెస్ యూడీఎఫ్ విజయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం

- సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 04 :-** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో కేరళ కాంగ్రెస్ నేతృత్వంలోని యు డి ఎఫ్ విజయంపై కర్నూలు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు సూచన మేరకు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తుది లెక్కింపులో కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూడీఎఫ్ (యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) విజయం సాధించిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష తెలియ చేశారు, కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందో త్సాహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకు న్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, భవిష్యత్ ఎన్నికల్లో ప్రజలకు మరింత చేరువ కావడానికి మా యువ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే బిజెపి పతనం ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎస్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి మీసాల సుమలత. ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ 48 వార్డు ఇన్చార్జి షేక్ షబ్బీర్ మొదలుగు వారు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం.. పది ఫలితాల్లో మెరుగైన ప్రదర్శన



**వేంపల్లి మన జనప్రగతి మే 04:-** పది తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రభంజనం సృష్టించాయి. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. జనసేన నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించడం విద్యా రంగంలో సానుకూల మార్పుకు నిదర్శనమన్నారు. దుల్లా చిన్నారి, నిహారిక, దివ్య తేజస్వి, కొల్లాపూర్ సాయి శ్రీ తలో 596 మార్కులు సాధించగా, దిక్షిత సాయి, నంద్యాల కార్తిక, హర్షిని, వైష్ణవి, కోలా లక్ష్మీ వెంకటేశ్వర, సత్య దుర్గ, యార్షిని, హాసిని వంటి విద్యార్థులు 595 మార్కులు సాధించారు. ఇవి కార్పొరేట్ పాఠశాలల మార్కులు కాకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులవేనని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ముఖ్యంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈసారి సాధారణ ఉత్తీర్ణత శాతం 81.25% నుంచి 85.25%కు పెరగడం గమనార్హమన్నారు. అలాగే అమ్మాయిల ఉత్తీర్ణత శాతం 5.22% పెరగడం మరో విశేషమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించిన ఉపాధ్యాయులకు గోసల ఆంజనేయులు ధన్యవాదాలు తెలిపారు.



# చిన్నకూడాలలో విజిబుల్ పోలీసింగ్

**లింగాల మన జనప్రగతి మే 04:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న కుడాల గ్రామంలో సోమవారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో లింగాల ఎస్.ఐ డి. జగదీశ్వర రెడ్డి తన సిబ్బందితో కలిసి చిన్నకుడాలలో గ్రామస్తులతో నేరుగా మాట్లాడి చోరీలను నివారించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, మహిళా భద్రత, డయల్ 112, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగేలా విరిగిన చెట్ల కొమ్మలను తొలగించండి: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి మే 04:-** గాలి, వానతో విరిగిన, ప్రమాధకరంగా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని బైరాగిపట్టేడ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో పాటు గాలి, వానకు విరిగిన చెట్ల కొమ్మల తొలగింపును అధికారులతో కలసి పరిశీలించారు. విరిగి పోయి వేలాడుతున్న వాటితో పాటు, ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. రుతు పవనాల ప్రభావం వలన వర్షాలు రానున్నాయని ఈ లోపు ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి తొలగించి, వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడక్కడా పడిపోయి ఉన్న డ్రైనేజి కాలువలను గుర్తించి మరమ్మతులు చేయాలని తెలిపారు. నగరంలో పారిశుదధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డి.ఈ.మహేష్, ఏసీపీ పార్వతి ప్రియ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# మహానాడుకు ముస్తాబవుతున్న నెల్లూరు

- కిసాన్ సెజ్‌లో శరవేగంగా భూమిపూజ ఏర్పాట్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు మన జనప్రగతి మే 04:-** జిల్లా కొడవలూరు మండలం లోని కిసాన్ సెజ్‌లో ప్రతిష్టాత్మక మహానాడు భూమిపూజకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం పరిశీలించారు. సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజుతో చర్చించి పలు సూచనలు చేశారు. పార్టీ అధినేత,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడురోజుల పాటు జిల్లాలో ఉండనుండటంతో యంత్రాంగం అప్రమత్తమై భద్రతకు సర్వం సిద్ధం చేస్తోంది. ఈ పర్యవేక్షణలో రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్,వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ,తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి తదితర నేతలతో కలిసి పాల్గొన్నారు .

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -05-2026

# పిజిఆర్ఎస్ అర్జీలు సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలి

**• జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**అన్నమయ్య బ్యూరో మన జన ప్రగతి మే 04 :-** మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఏడి సర్వేయర్ భరత్ కుమార్ లు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ కాల్స్ నందు పాజిటివ్ పర్ఫార్మెన్స్ (సానుకూల పనితీరు) ప్రజల నుండి సేకరించే అభిప్రాయాలలో పురోగతి సాధించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పనితీరుపై దృష్టి పెట్టి రాష్ట్రంలో జిల్లాను మెరుగైన స్థానంలో ఉండేలా కృషి



చేయాలని తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. **ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు** బి.కొత్తకోట మండలం, బి.కొత్తకోటకు చెందిన రెడ్డమ్మ తనకు బడి కాయల పల్లి రోడ్డు నల్లగొట్టపల్లి వద్ద గల కాలనీలో ప్రభుత్వం నుండి మంజూరు చేశారని ఆ స్థలంలో ఇంటికి సంబంధించి మాకు రావలసిన గుణాతి బిల్లు ఇదే గ్రామానికి చెందిన బడ్రేవు రెడ్డమ్మ కు బిల్లును ఇవ్వడం జరిగిందని ఈ విషయమై హౌసింగ్ అధికారులకు తెలియజేయడం జరిగిందని తమరు ఈ విషయాన్ని పరిశీలించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్నారు. కె.వి పల్లి మండలం, రామిరెడ్డి వారి పల్లి కు చెందిన కె. చిన్న రెడ్డప్ప తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, కుటుంబం గడవడానికి చాలా కష్టంగా ఉందని తమకు ఎలాంటి ఆధారము లేదని ప్రభుత్వం ద్వారా వృద్ధాప్య పెన్షన్ ను మంజూరు చేయాలని దరఖాస్తును సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 292 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. **కిషోరి వికాసం పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించనున్న "కిశోరి వికాసం బేటి బచావో, బేటి పడావో" ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పి.జి.ఆర్.ఎస్ సమావేశం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కౌమార దశలో ఉన్న బాలబాలికల సమగ్ర అభివృద్ధి కోసం ఈ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. 01-05-2026 నుండి 11-06-2026 వరకు నిర్వహించబడే ఈ కార్యక్రమంలో విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం మరియు పోషకాహారం, ఋతు పరిశుభ్రత, లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం, టీనేజ్ గర్భధారణ నివారణ, మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణ, జీవనోపాధి అవకాశాలు, కెరీర్ మార్గదర్శనం, సైబర్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రయాణంలో ఎప్పుడు ఎలాంటి అవసరం ఏర్పడిన వెంటనే అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల సహాయవాణి 181, పిల్లల సహాయవాణి 1098 వంటి ఫోన్ చేసి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు,చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం

**స్త్రీరక్ష పోర్టల్,శక్తి యాప్ సేవల వినియోగంపై అవగాహన**

**బొమ్మనహల్ మన జనప్రగతి మే 04:-** జిల్లా ఎస్పీ పి.జగదీష్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, జిల్లా మహిళ డీఎస్పీ మహబూబ్ భాషా, రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ఆధ్వర్యంలో బొమ్మనహల్ మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామంలో పాండురంగస్వామి పంక్షన్ హాల్ లో మహిళల భద్రత పైన మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ముఖ్యంగా గృహహింస, వేధింపులు, సైబర్ మోసాలు, బాల్య వివాహాల వంటి అంశాలపై మహిళ సంఘ సభ్యులకు వివరంగా అవగాహన కల్పించారు, అదేవిధంగా జిల్లా మహిళ డీఎస్పీ



మహబూబ్ భాషా మాట్లాడుతూ.. శక్తి టీమ్ సేవలు, మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లు, పోలీస్ స్టేషన్‌లో అందించే సేవల గురించి తెలియజేశారు, మహిళలు, విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు, తప్పకుండా అలాంటి వారికి చట్టం పూర్తి రక్షణ కల్పిస్తుందని అధికారులు హితవు పలికారు, కుటుంబ మరియు సామాజిక స్థాయిలో మహిళల భద్రతకు అందరూ బాధ్యత వహించాలని సూచించారు, అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళల్లో ధైర్యం, స్వీయరక్షణ భావన పెంపొందించడం పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు, మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని, సురక్షితమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, ముఖ్యంగా అనంతపురం జిల్లా పోలీస్ శాఖ మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్తానిక పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని తక్షణ సహాయం చేయడానికి పోలీస్ శాఖ ముందుంటుందని విజ్ఞప్తి చేశారు, బొమ్మనహల్ సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్, కనేకల్ సబ్ ఇన్స్పెక్టర్ నాగమధు, హిరేహాల్ సబ్ ఇన్స్పెక్టర్ గురుప్రసాద్ రెడ్డి, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సీట్లు కేటాయింపు**

**దేవస్థాన పాలక మండళ్లలో సభ్యులుగా అవకాశం**

**త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు**

**విద్యతోనే కురుబలు శాసించే స్థాయికి... : మంత్రి సవిత**

**కుప్పం కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సవిత**

**ఆలయంలో ప్రత్యేక పూజలు**

**కుప్పం/చిత్తూరు మన జనప్రగతి మే 04:-** టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు దేవస్థాన బోర్డు సభ్యులగానూ కురుబలకు అవకాశమివ్వనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం కేంద్రంలో జరుగుతున్న కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. గతేడాది జరిగిన ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్గోన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేసి, ఆలయ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయల కల్పించారన్నారు. కురుబల తరఫున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. **స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ప్రాధాన్యం...** టీడీపీ ఆవిర్భావం నుంచి కురుబలకు రాజకీయ ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. 2014 సాధారణ ఎన్నికల్లోనూ కురుబలకు రెండు ఎంపీలు, ఒక ఎమ్మెల్యేగా సీట్లు ఇచ్చి గెలిపించుకున్నారన్నారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన తనకు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అవకాశమిచ్చి ప్రోత్సాహిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కురుబల అధికంగా ఉన్నచోట్ల టీడీపీ తరఫున ఎన్నికల బరిలో దింపనున్నట్లు తెలిపారు. పలు దేవస్థాన బోర్డుల్లోనూ కురుబలకు సభ్యులుగా అవకాశమివ్వనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇలా అన్నింటా కురుబలకు టీడీపీ





ప్రోత్సాహంతో రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందన్నారు. గుడికట్ల పూజారులకు త్వరలోనే గౌరవ వేతనాలు అందించనున్నామన్నారు. గుడి కట్ల దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత వెల్లడించారు. **విద్యతోనే శాసించే స్థాయికి...** విద్యతోనే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయొచ్చునని, శాసించే స్థాయికి చేరుకోవొచ్చునని మంత్రి సవిత తెలిపారు. కురబలు తమ బిడ్డలకు ఉన్నత విద్య చదివించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. పేదలు, బీసీల విద్య కోసం అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యలో కురుబల రాణించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్సీ శ్రీకాంత్, కురబ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున. ఇతర కురుబ సామాజిక ప్రతినిధులు, వర్గీయులు అదిక సంఖ్యలో ఉన్నారు.

## సోమవారం సందర్బంగా శ్రీ అగస్త్యేశ్వర స్వామి మెరవణి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 04:-** స్థానిక అగస్త్యేశ్వర ఆలయంలో సోమవారం సాయంత్రం దేవస్థానం వారిచే ఆలయ కార్యనిర్వహణాధికారి కే.వి.రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల మిరవణి ఆలయం లోపల నిర్వహించారు. భక్తాదులందరూ స్వామి వారి యొక్క సేవలో పాల్గొని స్వామి అమ్మవార్ల అనుగ్రహమును పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


## త్రాగునీటి పథకాల బిల్లులను తక్షణమే చెల్లించాలి: మంత్రి పయ్యావుల కేశవ్



**ఉరవకొండ మన జనప్రగతి మే 04: -** వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, సంబంధిత పథకాల బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కౌకుంట్ల గ్రామంలోని తన క్యాంపు కార్యాలయం నుండి ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శులు మరియు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ శ్రీ సత్యసాయి వాటర్ బోర్డు, శ్రీరామరెడ్డి త్రాగునీటి పథకం మరియు ఆర్డబ్ల్యూఎస్ కింద ఉన్న సీపీడబ్ల్యూ పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మంత్రి సూచించారు. త్రాగునీటి పథకాల్లో పనిచేస్తున్న వర్కర్ల జీతభత్యాల సమస్యలను పరిష్కరించి, వారికి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా త్రాగునీటి ఎద్దడి తలెత్తితే అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. నిరంతర పర్యవేక్షణ: వేసవి కాలం ముగిసే వరకు నీటి సరఫరాలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్థిక శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ స్వయంగా చొరవ తీసుకుని నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వడంతో, జిల్లాలో త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

## పెన్నోబిలంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**- గరుడ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి దర్శనం**



**ఉరవకొండ మన జనప్రగతి మే 04:-** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఏడవ రోజున అత్యంత వైభవంగా జరిగాయి. భక్తిభావం వెల్లివిరిసిన ఈ వేడుకల్లో స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నేటి వేడుకల సుప్రభాత సేవ & ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, విశేష మహాభిషేకాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. గరుడ వాహన సేవ: సాయంత్రం స్వామివారిని, ఇరువురు దేవేరులను పట్టువస్త్రాలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం గరుడ వాహనం పై వేంచేపు చేసి, 'నమో నారసింహ' స్మరణల మధ్య ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి, దేవేరులకు కళ్యాణోత్సవం అత్యంత రమణీయంగా జరిగింది. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కళ్యాణోత్సవం ముగిశాక, స్వామివారి ముత్యాల తలంబ్రాలను దక్కించుకోవడానికి యువత, భక్తులు పోటీపడ్డారు. ప్రముఖుల హాజరుఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథశాస్త్రి, మయూరం బాలాజీ, గుండురావు దేవస్థాన కమిటీ చైర్మన్ రేగటి నాగరాజు కార్యనిర్వహణాధికారి (జూ) సాకే రమేష్ బాబు మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తి పారవశ్యం గరుడ సేవ, కళ్యాణోత్సవాలతో పెన్నోబిలం క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174